సాక్షి తిరుపతి

శనివారం । 9 । నవంబర్ । 2024



సర్వేతో తేలిన దౌర్జన్యం

తనది కాని భూమిని ఆక్రమించేందుకు చేసిన ప్రయత్నాలు రెవెన్యూ, పోలీసు అధికారుల సర్వేతో బెడిసి కొట్టాయి. - 8లో



ఇసుక అక్రమ రవాణాపై కొరడా

ఇసుక అక్రమ రవాణాపై చంద్రగిరి రెవెన్యూ, పోలీసు అధికారులు కొరడా ఝుళిపించారు. కొన్ని వాహనాలను సీజ్ చేశారు. - 8లో



జీవ వైవిధ్య పరిరక్షణకు ప్రాధాన్యం

జీవ వైవిధ్య పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ప్రాధాన్యతనివ్వాల్సిన అవసరం ఉందని ఐజర్ డైరెక్టర్ పేర్కొన్నారు. - 8లో

న్యూస్‌రీల్

డీఎస్సీ ఉచిత కోచింగ్ ఎంట్రన్స్ వాయిదా

తిరుపతి అర్బన్: డీఎస్సీ ఉచిత కోచింగ్ ఎంట్రన్స్ పరీక్షను వాయిదా వేస్తున్నట్లు జిల్లా ఎస్సీ వెల్ఫేర్ అధికారి చెన్నయ్య శుక్రవారం వెల్లడించారు. ఈ నెల 10వ తేదీన జిల్లాలోని మూడు సెంటర్లలో పరీక్ష నిర్వహించాల్సి ఉన్నప్పటికీ గుంటూరు, కృష్ణ, ఉభయగోదావరి జిల్లాల పరిధిలో ఎమ్మెల్సీ ఎన్నిక నేపథ్యంలో ఎంట్రన్స్ పరీక్షను వాయిదా వేస్తున్నట్లు స్పష్టం చేశారు. ఎంట్రన్ పరీక్ష తేదీలను ఎమ్మెల్సీ ఎన్నికల తర్వాత ప్రకటిస్తామని ఆయన స్పష్టం చేశారు.

అయోమయంలో విద్యార్థులు

ఉచిత డీఎస్సీ కోచింగ్‌కు గత ఆగస్టులో బీసీ విద్యార్థుల నుంచి, సెప్టెంబర్‌లో ఎస్టీ విద్యార్థుల నుంచి, అక్టోబర్‌లో ఎస్సీ విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. బీసీ విద్యార్థులు 300 మంది దరఖాస్తు చేసుకుంటే అందులో 200 మందికి మాత్రమే శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. వారికి ప్రభుత్వం నుంచి గ్రీన్ సిగ్నల్ వచ్చిన తర్వాత పుస్తకాలు ఇచ్చి, కోచింగ్ మాత్రమే అందిస్తామని చెప్పారు. భోజనం, వసతి సౌకర్యం లేదని స్పష్టం చేశారు. మరోవైపు ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల నుంచి 539 దరఖాస్తులు రాగా..వారిలో 150 మందికి మాత్రఉచిత కోచింగ్ ఇవ్వాలని నిర్ణయించారు. ఈ నెల 10వ తేదీన డీఎస్సీ సిలబస్‌పైనే ఎంట్రన్స్ పరీక్ష నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఎంట్రన్స్‌లో మొదటి 150 మంది మెరిట్ మార్కుల ఆధారంగా తీసుకుని వారికి మాత్రమే ఉచిత కోచింగ్ ఉంటుందని చెప్పారు. అయితే మళ్లీ ఆ ఎంట్రన్స్ పరీక్ష వాయిదా వేయడంతో విద్యార్థులు అయోమయంలో పడ్డారు.

ఏఎన్‌యూ దూరవిద్యకు ఎంబీఏ, ఎంసీఏ ప్రవేశ పరీక్ష

తిరుపతి సిటీ: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ దూరవిద్య ద్వారా అందిస్తున్న ఎంబీఏ, ఎంసీఏ కోర్సులలో చేరదలచిన అభ్యర్థులకు శనివారం తిరుపతి గేట్ డిగ్రీ కళాశాలలో ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు కళాశాల చైర్మన్ తమ్మినేని వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు తత్కాల్ పద్ధతిలో విద్యార్హత పత్రాలు, పరీక్ష ఫీజుతో శనివారం గేట్ కళాశాలకు హాజరుకావాలని కోరారు. మరిన్ని వివరాలకు 6302336171, 9000490820లో సంప్రదించాలని సూచించారు.

పింఛన్ బాబూ?

- 50 ఏళ్లకే పింఛన్ హుళక్కేనా
- జిల్లాలో ఎస్సీ, ఎస్టీ, బీసీలు 3.7 లక్షల మంది
- అందులో అర్హులు 75 శాతం మందిపైనే
- కక్ష సాధింపుతో తొలగిస్తున్న పండుటాకుల పింఛన్లు
- లబోదిబోమంటున్న బాధితులు

తిరుపతి అర్బన్: బాబు మాటల గారడీకి ప్రజలు మరోసారి బలైపోయారు. ఎన్నికల ముందు కొత్త పింఛన్లు ఇస్తాం.. పాతవాటిని కొనసాగిస్తామంటూ ప్రగల్భాలు పలికిన చంద్రబాబునాయుడు గద్దెనెక్కిన తర్వాత తన విశ్వరూపాన్ని చూపిస్తున్నారు. అధికారంలోకి వచ్చి ఐదు నెలలవుతున్నా ఒక్క కొత్త పింఛన్ మంజూరు చేయకపోగా.. ఉన్నవాటిని అనర్హుల పేరుతో ఏరివేస్తుండడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది.

నాలుగు నెలల్లో 3,674 పింఛన్ల తొలగింపు

గత నాలుగు నెలల్లో మొత్తం 3,674 పింఛన్లు తొలగించారు. ఇందులో గత జూలైలో జిల్లా వ్యాప్తంగా 2,69,162 పింఛన్లు మంజూరు చేయగా.. ఆగస్టుకొచ్చేసరికి అందులో 1,390 కోత విధించారు. అలాగే సెప్టెంబర్‌లో 683, అక్టోబర్‌లో 747, నవంబర్‌లో 854 పింఛన్లు తొలగించారు.

కొత్త పింఛన్లు ఎప్పుడో?

జిల్లాలో 50 సంవత్సరాలు పైబడిన ఎస్సీ, ఎస్టీ, బీసీలు జిల్లాలో 3.7 లక్షల మంది దాకా ఉన్నారు. ఇందులో 75 శాతం మందిపైనే అర్హులుంటారని అంచనా. వీరంతా కొత్త పింఛన్ల కోసం ఎదురు చూస్తున్నారు. మరో వైపు కక్షసాధింపు చర్యల్లో భాగంగా పింఛన్లు తొలగించిన పండుటాకులు ప్రతి సోమవారం కలెక్టరేట్ చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. దివ్యాంగులు సైతం నిత్యం చక్కెర్లు కొడుతున్నా అధికారులు కాదుకదా.. నాయకులు సైతం ఏమీ చేయలేకపోతున్నారు.



ప్రభాకర్, దివ్యాంగుడు (ఫైల్)



ఏ.హరీష్ తల్లిదండ్రులు(ఫైల్)

గత ప్రభుత్వంలో ఏటా రెండు సార్లు కొత్త పింఛన్లు

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఏటా జనవరి, జూలై నెలల్లో రెండు సార్లు అర్హులైన వారికి కొత్త పింఛన్లు మంజూరు చేసేవారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకుంటే చాలు సిబ్బంది వాటిని ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసేవారు. రాజకీయాలు, కులమతాలకు అతీతంగా, పేదరికమే ప్రామాణికంగా లబ్ధిదారులను ఎంపిక చేసేవారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇప్పటివరకు 11 వేలమంది కొత్త పింఛన్ల కోసం ఎదురు చూస్తున్నారు.

దివ్యాంగుల పింఛన్ ఇప్పించండి

మాది కల్యాణపురం ఎస్టీకాలనీ, పుత్తూరు మండలం, తిరుపతి జిల్లా. నేను రెండు నెలలుగా పింఛన్ కోసం కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్న గ్రీవెన్స్‌కు వచ్చిపోతున్నాను. అయినా నాకు పింఛన్ మంజూరు చేయలేదు. రోడ్డు ప్రమాదంలో రెండు కాళ్లు దెబ్బతిని పనిచేయడం లేదు. ఎస్టీ కులానికి చెందిన నాకు జీవనాధారం లేదు. దివ్యాంగుల పింఛన్ ఇప్పిస్తేనే జీవించగలుగుతాను.

–ప్రభాకర్, దివ్యాంగుడు

పింఛన్ ఇప్పించండి సారూ

నా పేరు ఏ.శేఖర్. మాది పుత్తూరు మండలంలోని కల్యాణపురం ఎస్టీకాలనీ. మా బిడ్డ హరీష్ పుట్టుకతోనే దివ్యాంగుడు. పేద కుటుంబానికి చెందిన మేము మా బిడ్డ వైద్య ఖర్చుల కోసం ప్రతి నెలా రూ.7వేలు ఖర్చు చేయాల్సి వస్తోంది. దీంతో అప్పుల బాధలతో ఇబ్బందులు పడుతున్నాం. మా బిడ్డకు పింఛన్ మంజూరు చేయండి.

–ఏ.హరీష్ తల్లిదండ్రులు

శ్రీవారి దర్శనానికి 20 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో అన్ని కంపార్టుమెంట్లు నిండాయి. క్యూలైన్ గోగర్భం వద్దకు చేరుకుంది. గురువారం అర్ధరాత్రి వరకు 52,643 మంది స్వామిని దర్శించుకున్నారు. 24,527 మంది తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.73 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టోకెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టోకెట్లు లేని భక్తులకు 20 గంటలు పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టోకెట్లు కలిగిన వారికి 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

అడిషనల్ ఈవో తనిఖీలు

అడిషనల్ ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి శుక్రవారం వేకువజామున నారాయణగిరి షెడ్లను తనిఖీ చేశారు. సకాలంలో భోజనం, పాలు అందుతున్నాయా లేదా అని భక్తులను అడిగి తెలుసుకున్నారు. చలికాలం కావడంతో వేడి పాలు నిరంతరాయంగా అందజేయాలని అధికారులను ఆదేశించారు. వైకుంఠం క్యూ కాంప్లెక్స్–2లో వేచి ఉన్న భక్తులకు వీలైనంత త్వరగా దర్శనం చేయించడానికి చర్యలు తీసుకోవాలని సూచించారు.

పుష్పయాగానికి అంకురార్పణ



పుట్టమన్ను సేకరిస్తున్న అర్చకులు

తిరుమల: తిరుమల శ్రీవారి వార్షిక పుష్పయాగానికి శుక్రవారం రాత్రి అంకురార్పణ శాస్త్రోక్తంగా నిర్వహించారు. శనివారం పుష్పయాగాన్ని పురస్కరించుకొని ముందు రోజున వసంత మండపంలో అర్చకులు అంకురార్పణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అంకురార్పణ కారణంగా సహస్ర దీపాలంకార సేవను టీటీడీ రద్దు చేసింది. టీటీడీ అదనపు ఈఓ సీహెచ్ వెంకయ్యచౌదరి, ఆలయ డిప్యూటీ ఈఓ లోకనాథం, పేష్కార్ రామకృష్ణ పాల్గొన్నారు.

గజ వాహనంపై శ్రీవారి దేవరి

చంద్రగిరి(తిరుచానూరు): తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారు గజ వాహనంపై ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. అమ్మవారి జన్మనక్షత్రమైన ఉత్తరాషాఢం సందర్భంగా శుక్రవారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం అమ్మవారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి, నిత్య కైంకర్యాలను నిర్వహించారు. రాత్రి అమ్మవారికి ఎంతో ప్రీతిపాత్రమైన గజ వాహనంపై ఆశీనులై నాలుగు మాడ వీధులలో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు.



గజ వాహనంపై ఊరేగుతున్న శ్రీపద్మావతి అమ్మవారు

నేడు కల్యాణ వెంకన్నకు పుష్పయాగం

తిరుపతి రూరల్: తుమ్మలగుంట శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం పుష్పయాగాన్ని వైభవంగా నిర్వహించనున్నారు. సాయంత్రం 3 గంటల నుంచి శ్రీవారికి నిర్వహించే పుష్పయాగంలో 12 రకాల పుష్పాలు, 9 రకాల పత్రాలతో పాటు వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ స్వామి, అమ్మవార్ల ఉత్సవర్లకు ప్రత్యేక పూజాదికాలను నిర్వహించనున్నారు. ఏపీ, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి ప్రత్యేకంగా టన్నుల కొద్దీ తీసుకువచ్చిన పుష్పాలు, పత్రాలను స్వామి వార్ల ముందు రాసులుగా పోసి వైదిక కార్యక్రమాలను నిర్వహించనున్నారు. అంతకు ముందు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి దంపతులు, గ్రామస్తులు శ్రీవినాయక స్వామి ఆలయం నుంచి పుష్ప, ప్రతాలను ఊరేగింపుగా ప్రధాన ఆలయం వద్దకు తీసుకురానున్నారు.

క్లుప్తంగా

'స్నేహ హస్తం'తో సమస్యల పరిష్కారం

చిల్లకూరు: రైల్వేలో పదవీ విరమణ చేసిన వారి సమస్యలను పరిష్కరించేందుకు స్నేహ హస్తం కార్యక్రమం ఎంతోగానో ఉపయోపడుతుందని విజయవాడ డివిజనల్ వెల్ఫేర్ ఇన్‌స్పెక్టర్ సతీష్ తెలిపారు. గూడూరు పట్టణంలోని రైల్వే ఇన్‌స్టిట్యూట్‌లో శుక్రవారం స్నేహ హస్తం కార్యక్రమం నిర్వహించారు. స్నేహ హస్తం కార్యక్రమం ద్వారా ఆన్‌లైన్‌లో సమస్యలు పరిష్కరించేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. వేదాయపాళెం స్టేషన్ సూపరింటెండెంట్ డీ.మునిబాబు, నెల్లూరు చీఫ్ ఆఫీస్ సూపరింటెండెంట్ కే.రవి, గూడూరు సీబీఎస్ఆర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ప్రీ రిపబ్లిక్ పరేడ్‌కు మహిళా వర్సిటీ విద్యార్థులు

తిరుపతి సిటీ: మహారాష్ట్ర జలగాంలోని కేబీసీ యూనివర్సిటీలో ఈ నెల 12వ తేదీ నుంచి జరిగే ప్రీ రిపబ్లిక్ పరేడ్‌కు పద్మావతి మహిళా వర్సిటీ విద్యార్థినులు ఎంపికయ్యారు. వీసీ ప్రొఫెసర్ ఉమ మాట్లాడుతూ మహిళా వర్సిటీ ఎన్ఎస్ఎస్ విద్యార్థినులు ప్రత్యూష, కావ్య పరేడ్‌కు ఎంపిక కావడం సంతోషకరమన్నారు.

అక్రమ నిర్మాణాల నిలిపివేత

పుత్తూరు: మండలంలోని తడుకు రెవెన్యూ మజ్జిగగుంట వద్ద అక్రమ నిర్మాణాలను తక్షణం నిలిపేయాలని తిరుపతి ఆర్డీఓ రామ్మోహన్ స్థానిక రెవెన్యూ అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాక్షి దినపత్రికలో 'ప్రభుత్వ భూములు అమ్మేస్తున్నా..' శీర్షికన భూ ఆక్రమణలపై కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన ఆర్డీఓ సాయంత్రానికి అక్రమ నిర్మాణాలను నిలిపివేయాలని ఆదేశించారు.

వైద్య విద్యార్థులకు క్విజ్ పోటీలు

తిరుపతి తుడా: స్విమ్స్ వర్సిటీ పద్మావతి మహిళా వైద్యకళాశాలలో రాష్ట్రంలోని వైద్య విద్యార్థులకు హయగ్రీవ-2024 పేరుతో 5వ రాష్ట్ర స్థాయి క్విజ్ పోటీలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్విమ్స్ ఆస్పత్రి డీన్ అల్లాడి మోహన్ మాట్లాడుతూ రాష్ట్రంలో పలు వైద్య కళాశాలల నుంచి సుమారు 39 మంది విద్యార్థులు ఈ పోటీలలో పాల్గొన్నారని తెలిపారు. ప్రథమ స్థానంలో పద్మావతి మహిళా వైద్యకళాశాల విద్యార్థులు నిలవగా, ద్వితీయ స్థానాన్ని నంద్యాల గవర్నమెంట్ వైద్యకళాశాల విద్యార్థులు దక్కించుకున్నట్లు తెలిపారు. తృతీయ స్థానంలో నెల్లూరు నారాయణ వైద్య కళాశాల విద్యార్థులు నిలిచారన్నారు. రిజిస్ట్రార్ అపర్ణ ఆర్ బిట్లా, పద్మావతి వైద్యకళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ముక్తేశ్వరయ్య, కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి నాగరాజు పాల్గొన్నారు.

ఇంటి ముంగిటకే మద్యం!

- విచ్చలవిడిగా బెల్టుషాపుల నిర్వహణ
- తాజాగా శ్రీధనమల్లిలో బహిరంగ వేలం
- రూ.1.6 లక్షలకు దక్కించుకున్న స్థానికుడు

దొరవారిసత్రం: కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చిన తర్వాత సంక్షేమ పథకాల మాటేమోగానీ.. మద్యాన్ని మాత్రం ఇంటి ముంగిటకే అందించేందుకు శతవిధాలా యత్నిస్తోంది. ఇందులో భాగంగానే గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్టు షాపుల నిర్వహణ కొనసాగుతోంది. పోటీ ఉంటే వేలం పాటలు పెట్టి మరీ షాపులు నిర్వహించుకునేందుకు ప్రోత్సహిస్తోంది.

డీవీ సత్రంలో లక్షల్లో వేలం పాటలు

దొరవారిసత్రం మండల పరిధిలోని 65 గ్రామాల్లో 35,900 మంది జనాభా ఉన్నారు. అధికారంగా రెండు మద్యం షాపులను రాష్ట్ర ప్రభుత్వం కేటాయించగా దొరవారిసత్రం, పూలతోట గ్రామాల్లో అమ్మకాలు సాగుతున్నాయి. ఇవి కాకుండా ప్రతి గ్రామంలో బెల్టు దుకాణాలు ఏర్పాటుకు ఆయా ప్రాంతాల్లోని క్షేత్ర స్థాయి పచ్చ నేతలు బహిరంగంగా



శ్రీధనమల్లి గ్రామంలో బెల్టు దుకాణం కోసం వేలం పాట నిర్వహిస్తున్న దృశ్యం

వేలం పాటలు నిర్వహిస్తున్నారు. బెల్టు షాపుల నిర్వాహకులకు స్థానిక పోలీసుల నుంచి ఎక్సైజ్ పోలీసుల వరకు ఎలాంటి ఇబ్బందులు వచ్చినా తామే చూసుకుంటామని భరోసా ఇస్తున్నారు. ఇప్పటికే వేణుంబాకం, కల్లూరు, ఉచ్చూరు, శ్రీధనమల్లి, తొగరాముడి, మీజూరు తదితర గ్రామాల్లో బెల్టు దుకాణాలు ఏర్పాటుకు వేలం పాటలు నిర్వహించినట్లు తెలిసింది. ఒక్కో బెల్టు షాపును రూ.1.5 లక్షల నుంచి రూ.2 లక్షల వరకు వేలం పాటలో దక్కించుకున్నట్లు సమాచారం.

సైబర్ సెక్యూరిటీతో ఆర్థిక మోసాలకు అడ్డుకట్ట



ప్రసంగిస్తున్న సైబర్ సెక్యూరిటీ నిపుణులు ఐఎల్ నరసింహారావు, సదస్సుకు హాజరైన పరిశ్రమల ప్రతినిధులు, పోలీసులు

శ్రీసిటీ (వరదయ్యపాళెం): పటిష్టమైన సైబర్ సెక్యూరిటీతో ఆర్థిక మోసాలకు అడ్డుకట్ట వేయొచ్చని హైదరాబాద్‌కు చెందిన సైబర్ సెక్యూరిటీ నిపుణులు ఐఎల్.నరసింహారావు వెల్లడించారు. శుక్రవారం శ్రీసిటీలోని వ్యాపార వాణిజ్య కేంద్రంలో సైబర్ క్రైం, సైబర్ సెక్యూరిటీపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమాన్ని శ్రీసిటీ సెక్యూరిటీ విజిలెన్స్ విభాగం అధికారి వై.రమేష్, శ్రీసిటీ హైటెక్ పోలీస్ స్టేషన్ డీఎస్పీ పైడేశ్వరరావు లాంఛనంగా ప్రారంభించారు. వివిధ పరిశ్రమలకు చెందిన ముఖ్య ప్రతినిధులు పాల్గొన్న ఈ సదస్సును ఉద్దేశించి నిపుణులు మాట్లాడుతూ.. ప్రస్తుత సైబర్ బెదిరింపులు, ఆర్థిక మోసాల వ్యూహాలు, కంప్యూటర్ హ్యాకింగ్‌తో పాటు పెరుగుతున్న డిజిటల్ విజిలెన్స్ అవసరాన్ని ప్రస్తావించారు. సైబర్ నేరాలలో ఆర్థిక నేరాలదే అగ్రస్థానం అన్న ఆయన ఇందు కోసం వాట్సాప్, యూట్యూబ్, ఫేస్‌బుక్ వంటి సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌ల నుంచి వ్యక్తిగత సమాచారాన్ని లక్ష్యం చేసుకుంటాయని పేర్కొన్నారు. ర్యాన్‌సమ్ వేర్ వంటి సైబర్ అటాక్‌ల గురించి వివరిస్తూ వాటిపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. ఇంటర్నెట్ సంబంధిత కార్యకలాపాలను నిర్వహించడానికి ప్రత్యేక చిట్కాలను సూచించారు. అనంతరం శ్రీసిటీ డీఎస్పీ పైడేశ్వరరావు మాట్లాడుతూ తిరుపతి జిల్లా ఎస్పీ చొరవ మేరకు జిల్లా వ్యాప్తంగా వినియోగదారులకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో 120 మంది హెచ్ఆర్ మేనేజర్లు, ఎగ్జిక్యూటీవ్‌లు, శ్రీసిటీ హైటెక్ పోలీస్ స్టేషన్ సీఐ బీవీ.శ్రీనివాసులు, ఎస్ఐ హరిప్రసాద్ పాల్గొన్నారు.

కొత్తగా మూడు ప్యాకేజీ టూర్లు

తిరుపతి(అలిపిరి): కార్తీక మాసం సందర్భంగా తిరుపతి నుంచి కొత్తగా మూడు కొత్త ప్యాకేజీ టూర్లను ప్రవేశపెట్టినట్లు ఆంధ్రప్రదేశ్ పర్యాటకాభివృద్ధి సంస్థ డివిజనల్ మేనేజర్ సీహెచ్. శ్రీనివాసరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 16, 23 తేదీలలో ఒక్కరోజు మహానంది, శ్రీశైలం ప్యాకేజీ టూర్ ఉంటుందన్నారు. నాన్ ఏసీ బస్సులో 16, 23 తేదీలలో శనివారం రాత్రి 9 గంటలకు ప్రయాణం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. బస్సు తిరిగి మూడో రోజు సోమవారం ఉదయం 6 గంటలకు వస్తుందన్నారు. పెద్దలకు ఒకరికి టిక్కెట్ ధర రూ.3,300, పిల్లలకు రూ.2,510 (రవాణ చార్జీ, నాన్ ఏసీ, ఫ్రెష్‌ప్, భోజనం, గైడ్ సౌకర్యంతో కలిపి..) ఉంటుందని తెలిపారు. అలాగే తలకోన, శ్రీనివాసమంగాపురం టూర్ ప్యాకేజీకి (ప్రతి ఆది, సోమవారాలు) ఒకరికి రూ.400 (రవాణ చార్జీలు, గైడ్ సౌకర్యంతో కలిపి)తో ఉంటుందన్నారు. రోజూ ఉదయం 9 గంటలకు బస్సు బయలుదేరి సాయంత్రం 5 గంటలకు తిరిగి చేరుకుంటుందని తెలిపారు. గుడిమల్లం ప్యాకేజీ టూర్‌లో తిరుచానూరు - అప్పలాయగుంట, గుడిమల్లం ఆలయాలకు రోజూ ఒకరికి రూ.400 (రవాణా చార్జీ, గైడ్ సౌకర్యంతో కలిపి...) ఉంటుందన్నారు. తిరుపతిలోని శ్రీనివాసం, విష్ణు నివాసం నుంచి బస్సులు బయలుదేరుతాయని తెలిపారు. ఈ కొత్త ప్యాకేజీ టూర్లను తిరుపతి, చిత్తూరు జిల్లా ప్రజలు, యాత్రికులు వినియోగించుకోవాలని తెలిపారు. ఇతర వివరాలకు ఫోన్ నం.9848007033, 0877-2289123లలో సంప్రదించాలని కోరారు.

15 వరకు తపాలా శిబిరాలు

తిరుపతి(అలిపిరి): తపాలా శాఖ, రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా గ్రామ, వార్డు సచివాలయ స్థాయిలో ఈనెల 15వ తేదీ వరకు ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ (ఐపీపీబీ)తో కొత్త ఖాతాలను తెరవడం, ఆధార్ లింకేజీని సులభతరం చేయడానికి ప్రత్యేక క్యాంపులను డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ (డీబీటీ) లబ్ధిదారుల కోసం నిర్వహించనున్నట్లు తిరుపతి పోస్టల్ డివిజన్ సీనియర్ సూపరింటెండెంట్ బీ.నరసప్ప తెలిపారు. జిల్లా యంత్రాంగం సహకారంతో గ్రామ, వార్డు సచివాలయ స్థా యిల్లో ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తారని.. కొత్త ఐపీపీబీ బ్యాంక్ ఖాతాల ను తెరవడం, ఇప్పటికే ఉన్న ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ ఖాతాలకు ఆధార్‌ను లింక్ చేయడం, ఎన్‌పీసీఐ మ్యాపింగ్‌ను సులభతరం చేయడం ప్రాథమిక లక్ష్యమని పేర్కొన్నారు. ప్రస్తుతం నిరుపయోగంగా ఉన్న 2.91 లక్షల ఖాతాలను జిల్లా వ్యాప్తంగా ఉన్న 466 పోస్టు ఆఫీసుల నుంచి పునరుద్ధరించడం జరుగుతుందని తెలిపారు.

ఇసుక అక్రమ రవాణాపై కొరడా

చంద్రగిరి: గత కొంత కాలంగా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ఇసుకాసురులపై ప్రభుత్వ అధికారులు కొరడా ఝుళిపించారు. స్వర్ణముఖినదిలో ఇసుకను తలిస్తున్న వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. మండల పరిధిలోని నరసింగాపురం సమీపంలోని శుక్రవారం పెద్ద ఎత్తున ఇసుక అక్రమ రవాణా సాగుతున్నట్లు అధికారులకు సమాచారం అందింది. రెవెన్యూ, పోలీసు శాఖ అధికారులు సంయుక్తంగా స్వర్ణముఖి వాగులో దాడులు చేపట్టారు. ఈ దాడుల్లో ఏడు ఇసుక ట్రాక్టర్లు, రెండు జేసీబీలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వాటిపై కేసులు నమోదు చేసి, తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు. అయితే సీజ్ చేసిన వాహనాల్లో అధికార పార్టీకి చెందిన కొంత మంది వాహనాలు ఉన్నట్లు సమాచారం.

ప్రభుత్వ ఆదేశాలను తప్పుదోవ పట్టిస్తూ..!

రాష్ట్ర వ్యాప్తంగా ఇసుకను ఉచితంగా తీసుకెళ్లేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఆదేశాలను జారీ చేసింది. అయితే ఆ ఆదేశాలు ఇసుకాసురులకు వరంగా మారింది. దీంతో రాత్రింబవళ్లు నిరంతరాయంగా స్వర్ణముఖినదిలోని ఇసుకను అడ్డగోలుగా దోచేస్తున్నారు. వారి ఆగడాలను అరికట్టేందుకు వెళ్లిన అధికారులపైన కూడా నోరుపారేసుకున్నట్లు సమాచారం.

తిరుమలలో గోల్డ్ అప్రైజర్ తొలగింపు

తిరుమల: తిరుమలలోని తిరుపతి కో-ఆపరేటివ్ బ్యాంకులో నకిలీ బంగారంపై రుణం అందజేతలో కీలకభూమిక పోషించిన గోల్డ్ అప్రైజర్‌ను బ్యాంకు అధికారులు తొలగించారు. ఇటీవల తిరుమల శాఖలో నకిలీ నగలపై రుణం తీసుకున్నట్లు వచ్చిన ఆరోపణలపై బ్యాంకు ఉన్నతాధికారులు పరిశీలన జరిపి మోసం జరిగినట్లు గుర్తించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ఈ మోసానికి కారణమైన గోల్డ్ అప్రైజర్ తోపాటు మిగిలిన నిందితులపై తిరుమల టూటౌన్ పీఎస్‌లో ఫిర్యాదు చేసేందుకు బ్యాంకు ఉన్నతాధికారులు ప్రయత్నించారు. అయితే మోసానికి సంబంధించిన పూర్తి వివరాలతోపాటు, ఆధారాలను తీసుకురావాలని పోలీసు అధికారులు సూచించడంతో శుక్రవారం అధికారులు వెనుతిరిగారు.

తెలుగు సాహితీ సదస్సు ప్రారంభం



తెలుగు రచనలను ఆవిష్కరిస్తున్న అతిథులు

తిరుపతి సిటీ: జాతీయ సంస్కృత వర్సిటీ వేదికగా భావన సాహితీ వేదిక పేరుతో మూడు రోజుల పాటు జరగనున్న తెలుగు భాషా జాతీయ సదస్సు శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా భావన ప్రియ సాహితీ వేదిక అధ్యక్షులు డాక్టర్ ఎస్‌సీహెచ్ చక్రవర్తి, డాక్టర్ అల్లాడి మోహన్, వర్సిటీ వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి పాల్గొన్నారు. అనంతరం భావన సాహితీ వేదిక ద్వారా తెలుగు భాషలో రచించినటువంటి 22 పుస్తకాలను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ భావన ప్రియ సాహితీ వేదిక ప్రారంభించి ఏడేళ్ల కావస్తోందని, తెలుగు భాషా వైభవాన్ని, భాషను అందరూ సంరక్షించాలని కోరారు. డాక్టర్ సాంబశివమూర్తి, డాక్టర్ బి.నల్లన్న, వంద మందికిపైగా రచయితలు, కవులు పాల్గొన్నారు.

జీవవైవిధ్య పరిరక్షణకు ప్రాధాన్యం

తిరుపతి సిటీ: ఆధునిక సమాజంలో జీవ వైవిధ్య పరిరక్షణకు ప్రాధాన్యం ఇవాల్సిన అవసరం ఉందని ఐజర్ డైరెక్టర్ ప్రొఫెసర్ సంతను భట్టాచార్య, ఐఐటీ డైరెక్టర్ సత్యనారాయణ పేర్కొన్నారు. శుక్రవారం పద్మావతి మహిళా వర్సిటీ, ఐఐటీ, ఐజర్, ద్రావిడ వర్సిటీల భాగస్వామ్యంతో వర్సిటీలో ఏపీ ఎస్‌సీహెచ్ఈ-ఐబీసీ తిరుపతి క్లస్టర్ ప్రోగ్రాంను ప్రారంభించారు. వర్సిటీలోని సావేరీ సెమినార్ హాల్‌లో జరిగిన కార్యక్రమానికి వారు ముఖ్యఅతిథులుగా పాల్గొని జీవవైవిధ్య పరిరక్షణపై ప్రసంగించారు. మహిళా వర్సిటీ వీసీ ఉమ, రిజిస్ట్రార్ రజిని, డీన్ సుజాతమ్మ, ప్రొఫెసర్ మమత, డాక్టర్ ప్రసన్న ల్గొన్నారు

మామిడి సేద్యం బలోపేతం



వేదికపై హరినాథ్‌రెడ్డితోపాటు నాబార్డ్ ప్రతినిధులు, శాస్త్రవేత్తలు

తిరుపతి అర్బన్: మామిడి సేద్యం బలోపేతం చేద్దామని రాష్ట్ర ఉద్యానశాఖ అదనపు డైరెక్టర్ డాక్టర్ సీబీ హరినాథ్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం తిరుచానూరులోని తాజ్ హోటల్‌లో ఫుడ్ అండ్ అగ్రికల్చర్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్(ఎఫ్ఏసీఈ)వారు ఇంటర్‌ఫేస్ ఇన్ మ్యాంగో వాల్యూచైన్‌ను బలోపేతం చేయడానికి స్టేక్ హోల్డర్ కన్సల్టేషన్ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో మామిడి సాగులో ఏపీ అగ్రగామిగా ఉందని గుర్తుచేశారు. అయితే ఇటీవల మామిడి సాగుచేస్తున్న రైతులు 30 శాతానికి పైగా నష్టపోతున్నట్లు లెక్కలున్నాయని చెప్పారు. కార్యక్రమంలో నాబార్డ్ ప్రతినిధులు పుష్పిత్ గార్గ్, లక్ష్మీప్రసాద్, విజయవిహారి, సునీల్, చిత్తూరు జిల్లా ఉద్యానశాఖ అధికారి మధుసూదన్‌రెడ్డి, తిరుపతి, చిత్తూరు జిల్లాలకు చెందిన పలువురు మండల ఉద్యానశాఖ అధికారులు పాల్గొన్నారు.

ఇళ్ల మధ్యలో మద్యం దుకాణమా?



కరకంబాడిలో మద్యం దుకాణం ఏర్పాటును అడ్డుకుంటున్న మహిళలు

రేణిగుంట: ఇళ్ల మధ్యలో మద్యం దుకాణం పెట్టొద్దని మహిళలు అడ్డుకున్నారు. మండలంలోని కరకంబాడి సమీపం గొల్లపల్లి మార్గంలో కూటమి నేతలు మద్యం దుకాణం ఏర్పాటు చేసేందుకు చేపడుతున్న నిర్మాణాలను శుక్రవారం కరకంబాడి రాజీవ్‌నగర్‌కు చెందిన మహిళలు అడ్డుకున్నారు. మహిళలు, స్కూల్ పిల్లలు ఎక్కువగా తిరిగే ఈ మార్గంలో రోడ్డు పక్కన మద్యం దుకాణం ఎలా పెడుతారని వారు నిలదీశారు. దీంతో చేసేది లేక వైన్ షాపు యజమానులు దుకాణం ఏర్పాటు పనులను తాత్కాలికంగా నిలిపివేశారు.

టీడీపీ బూటకపు హామీలపై పోరాటం



వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డితో మాజీ ఎమ్మెల్యే సంజీవయ్య, ఇతర నేతలు

నాయుడుపేట టౌన్: కూటమి ప్రభుత్వ బూటకపు హామీలపై ప్రజలతో కలసి పోరాటం చేయడానికి వైఎస్సార్‌సీపీ సిద్ధమైందని మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య స్పష్టం చేశారు. ఈ మేరకు శుక్రవారం తాడేపల్లిలో వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి, పార్టీ చేపట్టే సంస్థాగత విషయాలపై చర్చించారు. సంజీవయ్య తో పాటు ఎన్‌డీసీసీబీ మాజీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డిలు సూళ్లూరుపేట నియోజవర్గ పరిధిలోని నాయకులతో కలిసి మాజీ సీఎంకు పుష్ప గుచ్ఛాలు అందించి ఘనంగా సన్మానించారు. పార్టీ ప్రతిష్టను పెపొందించేలా ప్రజాసమస్యలపై పోరాటాలు చేస్తున్న విషయాలను జగనన్న దృష్టికి తీసుకెళ్లినట్లు సంజీవయ్య పెర్కొన్నారు. నియోజవర్గంలో టీడీపీ నేతలు దుర్మార్గంగా వ్యవహరిస్తున్న తీరును సైతం తీసుకెళ్లినట్టు తెలిపారు. మాజీ సీఎంను కలిసిన వారిలో నాయుడుపేట మండల మాజీ కన్వీనర్ తంబిరెడ్డి సుబ్రహ్మణ్యంరెడ్డి, ఎన్‌డీసీసీబీ మాజీ డైరెక్టర్ కలికి మాధవరెడ్డి, ఓట్టురు కిషోర్ యాదవ్, మాజీ ఏఎంసీ చైర్మన్ కట్టా కమలాకర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

పేదలందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలి

- సీపీఐ ఆధ్వర్యంలో 18న సచివాలయాల వద్ద ఆందోళన



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర నేత హరినాథరెడ్డి

తిరుపతి కల్చరల్: ఎన్నికల ముందు సీఎం చంద్రబాబు నాయుడు పేదలకు గ్రామాల్లో అయితే 3 సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్లు చొప్పున ఇళ్ల స్థలాలు, వాటి నిర్మాణానికి రూ.5 లక్షల వరకు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారని, ఆ హామీని వెంటనే అమలు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పీ.హరినాథరెడ్డి డిమాండ్ చేశారు. బైరాగిపట్టెడలోని సీపీఐ కార్యాలయంలో శుక్రవారం సీపీఐ తిరుపతి జిల్లా కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తప్పకుండా నెరవేర్చాలన్నారు. పేదల ఇళ్ల నిర్మాణానికి సిమెంట్, ఇసుక, ఇనుము, ఇటుక, కంకర ఉచితంగా సరఫరా చేయాలన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి మాట్లాడుతూ ఇళ్ల స్థలాల మంజూరు కోసం ఈనెల 18న అన్ని సచివాలయాల ఎదుట నిరసన చేపట్టనున్నట్టు తెలిపారు. అలాగే రైతాంగ సమస్యల పరిష్కారం కోసం ఈనెల 26న కలెక్టరేట్ వద్ద ఆందోళన చేపట్టనున్నట్టు పేర్కొన్నారు. సీపీఐ నేతలు చిన్నం పెంచలయ్య, రాధాకృష్ణ, చిన్నరాజు, సుధాకర్‌రెడ్డి, గురవయ్య,బాలక్రిష్ణ, కత్తిరవి, ఉదయ్‌కుమార్, నదియా పాల్గొన్నారు.

మూడేళ్ల ఎల్‌ఎల్‌బీ కోర్సు ప్రవేశ పెట్టాలి



మంత్రికి వినతి పత్రం అందజేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

తిరుపతి సిటీ : ఎస్వీయూలో మూడేళ్ల వ్యవధిగల ఎల్‌ఎల్‌బీ కోర్సును ప్రవేశ పెట్టాలని జాతీయ న్యాయ విద్యార్థుల సంఘం (ఎన్ఎల్ఎస్ఏ) వ్యవస్థాపక అధ్యక్షుడు సుందరరాజు డిమాండు చేశారు. ఆయన శుక్రవారం ఎస్వీయూ యూత్ ఫెస్టివల్ ప్రారంభానికి హాజరైన రాష్ట్ర రవాణా శాఖా మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 30 లా కళాశాలలు ఉన్నాయని తెలిపారు. వాటిలో ప్రైవేటు కళాశాలల యజమాన్యం ప్రభుత్వం నిర్ణయించిన ట్యూషన్ ఫీజులకు రెండింతలు అధికంగా వసూలు చేస్తున్నట్టు ఆరోపించారు. వాటిపై చర్యలు తీసుకుని అనుమతులు రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో కార్యదర్శి రెడ్డి మోహన్, ఓబీసీ సంఘం అధ్యక్షుడు తిరుమలేష్, బీసీ జాక్ స్టూడెంట్ యూనియన్ రాయలసీమ ఇన్‌చార్జి విజయ్, యోగేష్, ముఖేష్ పాల్గొన్నారు.

సర్వేతో తేలిన దౌర్జన్యం!



పాతకాల్వలో వివాదంలోని భూమికి సర్వే చేసి హద్దులు చూపుతున్న సర్వేయర్లు, పక్కన సీఐ

తిరుపతి రూరల్: తనది కాని భూమిని ఆక్రమించేందుకు చేసిన ప్రయత్నాలను సర్వే అనే ఆయుధంతో రైతులు తిప్పికొట్టిన ఘటన తిరుపతి రూరల్ మండలం, పాతకాల్వ పంచాయతీలో శుక్రవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్లితే.. కల్పన అనే మహిళ తిరుపతి రూరల్ మండలం, పేరూరు లెక్కదాఖల సర్వే నం.197/1లో 50 సెంట్ల భూమిని కొనుగోలు చేసింది. తను కొనుగోలు చేసిన భూమికి సంబంధించి సరైన దారిలేదు. అందుకే పక్కనే ఉన్న సర్వే నం.197/2 లోని భూమికి సంబంధించిన హద్దులను రిజిస్ట్రేషన్ సమయంలో చూపించారు. హద్దులు చూపించారు కాబట్టి సర్వే నం.197/2లోని భూమిని ఆక్రమించుకునేందుకు ప్రయత్నించారు. దౌర్జన్యంగా భూమి చుట్టూ ప్రహరీ నిర్మించేందుకు ప్రయత్నించారు. అయితే 197/2కు సంబంధించిన రైతులు 15 ఏళ్ల క్రితమే లేఅవుట్ వేసి 14 మందికి ప్లాట్ల రూపంలో విక్రయించారు. తమ భూమిలో కల్పన దౌర్జన్యంగా ప్రహరీ నిర్మిస్తోందని, రక్షించాలని కొనుగోలుదారులు, రైతులు వేడుకున్నా పోలీసులు పట్టించుకోలేదు. అమరావతి స్థాయిలో ప్రభుత్వంలోని కొందరు పెద్దల ఒత్తిళ్లతో పోలీసులు కల్పనకు వత్తాసు పలుకుతున్నారని రైతులు ఆరోపించారు. దానికి తగ్గట్టుగానే కల్పన ఫిర్యాదు చేయడం, రైతులు, కొనుగోలుదారులపై తిరుపతి రూరల్ పోలీసులు కేసులు నమోదు చేయడం వెనువెంటనే జరిగిపోయాయి. సర్వేచేసి ఆమెకు సంబంధించిన భూమి అయితే తీసుకోవాలని బాధితులు చెప్పడంతో పోలీసులు సర్వేకు నిర్ణయించారు.

సీఐ సాక్షిగా....

సర్వే నం.197/1, 197/2 భూమికి సంబంధించిన హద్దులను నిర్ధారించాలని తిరుపతి రూరల్ సీఐ చిన్నగోవిందు రూరల్ తహసీల్దార్‌కు లేఖ రాశారు. దీంతో శుక్రవారం మండల సర్వేయర్ హేమకుమార్, విలేజ్ సర్వేయర్లు, సీఐ చిన్నగోవిందు వివాదంలోని పట్టా భూమిని సర్వే చేశారు. కల్పన నిర్మిస్తున్న ప్రహరీ ఆమెకు సంబంధం లేని సర్వే నం.197/2 లో ఉందని, ఆమె భూమి పక్కన ఉందని సర్వేయర్లు నిర్ధారించారు. ఆ మేరకు హద్దులను సైతం చూపించారు. న్యాయం గెలిచిందని రైతులు, ప్లాట్ల యాజమానులు ఆనందం వ్యక్తం చేశారు. ఇదిలా ఉంటే 197/2లో తాను నిర్మించుకున్న ఇంటితో పాటు తనపేరుతో ఉన్న విద్యుత్ మీటర్‌ను సైతం దొడ్డిదారిలో కల్పన పేరుతో మార్చుకున్నారని పేరూరుకు చెందిన హేమంత్ ఆచారి ఆవేదన వ్యక్తం చేశారు. లంచాలకు అలవాటు పడి విద్యుత్ మీటర్‌ను కల్పన పేరుతో మార్చిన అధికారులపైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తమపై కేసులు పెట్టి మానసికంగా వేధించిన కల్పనపై చర్యలు తీసుకోవాలని రైతులు గోపినాథ్‌రెడ్డి, రామచంద్రారెడ్డి డిమాండ్ చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

- మూడు కార్లు ధ్వంసం

పెళ్లకూరు: నాయుడుపేట-పూతలపట్టు జాతీయ రహదారి, పెన్నేపల్లి గ్రామ సమీపాన శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు కాగా, మూడు కార్లు దెబ్బతిన్నాయి. స్థానికుల సమాచారం మేరకు.. పుత్తూరు శల్య వైద్యశాలలో విరిగిన కాలుకు శస్త్ర చికిత్స చేయించుకున్న పాలిచర్ల సౌజన్య అనే మహిళ తిరిగి నెల్లూరుకు కారులో వెళ్తోంది. మార్గ మధ్యంలో పెన్నేపల్లి గ్రామ సమీపాన స్వర్ణముఖి అపార్ట్‌మెంట్ వద్ద ముందు వెళుతున్న లారీని వారి కారు అతి వేగంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో కారు డ్రైవర్ దారా హేమంత్‌తో పాటు, కారులో ఉన్న సౌజన్యకి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్ఐ నాగరాజు తన సిబ్బందితో కలిసి ఘటనా స్థలికి చేరుకున్నారు. ప్రమాదంలో గాయపడిన వారిని చికిత్స నిమిత్తం నాయుడుపేటకు తరలిస్తుండగా అదే సమయంలో నెల్లూరు నుంచి తిరుపతి వైపు వెళుతున్న మరో కారు రోడ్డుపై ఏర్పాటు చేసిన డివైడర్‌ను ఢీకొని, ముందు వెళుతున్న లారీని ఢీకొట్టింది. వెంటనే అదే మార్గంలో తిరుపతి వైపు వెళుతున్న ఇంకో కారు ప్రమాదానికి గురైన కారును ఢీకొంది. ఈ ఘటనలో మూడు కార్లు ముందు భాగాలు దెబ్బతిన్నాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం నాయుడుపేటకు తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తానా మాజీ అధ్యక్షుడితో వాగ్వాదం

రేణిగుంట: రేణిగుంట విమానాశ్రయంలో సీఎస్ఎఫ్ ప్రొటోకాల్ సిబ్బందికి, అమెరికాలోని తానా మాజీ అధ్యక్షుడు సతీష్ వేమనల మధ్య శుక్రవారం తీవ్ర వాగ్వాదం జరిగినట్లు సమాచారం. తిరుపతి నుంచి రోడ్డు మార్గంలో విమానాశ్రయానికి చేరుకున్న సతీష్ వేమన సీఎస్ఎఫ్ ప్రొటోకాల్ సిబ్బందిని ఓ కానిస్టేబుల్ పేరు ప్రస్తావిస్తూ అతని గురించి ఆరాతీశారు. అయితే సీఎస్ఎఫ్ సిబ్బంది తమకు తెలియదంటూ దురుసుగా సమాధానం చెప్పడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం మొదలైంది. సీఐఎఫ్ఎస్ సిబ్బంది ఈ ఘటనలో అత్యుత్సాహం ప్రదర్శించి ఆయన ఎక్కాల్సిన విమానం ఎక్కనివ్వకుండా అడ్డుకున్నారు. విషయం తెలుసుకున్న చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని ఆగమేఘాల మీద ఎయిర్‌పోర్ట్‌కు చేరుకుని ఎయిర్‌పోర్ట్ సీఐఎస్ఎఫ్ సిబ్బంది, తానా మాజీ అధ్యక్షుని మధ్య సయోధ్య కుదిర్చి అతనిని రాత్రి మరో విమానం ఎక్కించి హైదరాబాద్‌కు పంపినట్లు తెలుస్తోంది.